రోడ్లపైనే పార్కింగ్

- ప్రధాన ఏరియాల్లో ట్రాఫిక్ సమస్య
- ట్రాఫిక్ రూల్స్ పట్టించుకోని వాహనదారులు


పట్టణంలోని డీసీఎంఎస్ కాంప్లెక్స్ ప్రధాన రోడ్డుపై వాహనాల పార్కింగ్

హుజూరాబాద్: పట్టణంలోని ఆయా ప్రధాన రోడ్ల పైనే వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకి ఎక్కువ అవుతోంది. ప్రధాన వ్యాపార కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్య మరీ తీవ్రంగా ఉంటోంది. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్లను విస్తరణ చేయాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.బస్టాండ్ చౌరస్తా నుంచి సిర్సపల్లి క్రాస్ రోడ్డు వరకు జమ్మికుంట రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సముదాయాలున్నాయి, షాపుల ఎదుట బైక్‌లను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండటంతో బస్సులు, ఇతర పెద్ద వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. కొన్నిసార్లు ద్విచక్ర వాహనదారులు రాంగ్ రూట్‌లో వస్తుండటంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. సూపర్ బజార్‌లో సమస్య మరీ ఎక్కువ. వ్యాపార సముదాయాల ఎదుటే కూరగాయలను విక్రయించుకునేవారు ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకోవడంతో అటు వైపు వాహనాలను తీసుకెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి. అలాగే డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో సైతం అదే సమస్య. కాంప్లెక్స్ సమీపంలో ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకులకు వెళ్లేవారు వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. మరోవైపు ట్రాఫిక్ రూల్స్‌ను పట్టించుకోకుండా వాహనాలను నడుపుతున్నారు. అంబేడ్కర్ కూడలి, సైదాపూర్ క్రాస్, డిపో క్రాస్ వద్ద కొంతమంది రాంగ్‌రూట్‌లో వస్తుంటంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాఫిక్ పోలీసులు శ్రద్ధ చూపకపోతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల అంబేడ్కర్ కూడలి వద్ద లారీ డ్రైవర్ ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడంతో ఓ బ్యాంక్ ఉద్యోగి మృతి చెందాడు. ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాకారులు

హుజూరాబాద్: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు న్యాయం చేయాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు, రచయిత, గాయకుడు నెర్నాల కిషోర్ అన్నారు. 15న జిల్లా కేంద్రంలోని కళాభారతిలో నిర్వహించే పాటల పల్లకి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం పట్టణంలో ఆవిష్కరించారు. రాష్ట్రం సిద్ధించాక చాలా మంది కళాకారులకు న్యాయం జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కళాకారులను ఆదుకొని ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కళాకారుల గోసను ప్రభుత్వానికి తెలియజేసేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యమకారులు, మేధావులు, కళాకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాకారులు రఘు, నరేష్,యాకన్న, అనిల్, రమేష్, విష్ణు, రాజు, నగేష్, జంపన్న, రవి, జలపతిలు ఉన్నారు.

చార్జీలు తగ్గించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌కు బుధవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో పది లక్షలకు పైగా విద్యార్థులు ఆర్టీసీ బస్సుల ద్వారా పాఠశాలలు, కళాశాలలకు వెళ్తున్నారని, బస్సుపాస్ చార్జీలను ప్రభుత్వం పెంచడం ద్వారా పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మటి వేణుగోపాల్, రాంపెల్లి రోహిత్, నాయకులు గణేష్,రాజులు ఉన్నారు.

సన్మానం


ఏఈ రజితను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తిమ్మాపూర్: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని మారుమూల గ్రామం గుండారం ఉన్నత పాఠశాలలో చదివి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) ఉద్యోగం సాధించిన బోడపట్ల రజితను బుధవారం ఎల్ఎండీ ఎస్సారెస్పీ కార్యాలయంలో తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్, ఉపాధ్యాయులు పొన్నం వనిత, పాము చంద్రశేఖర్ సన్మానించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన రజిత కఠోర శ్రమతో ఏఈ ఉద్యోగం సాధించి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో డీఈ జ్యోతిశ్రీ, ఏఈఈ సత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను కలిసిన నాయకులు


సన్మానిస్తున్న యువజన నాయకులు

జమ్మికుంట: హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను పట్టణానికి చెందిన హుజూరాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చిన్నాల శ్రీకాంత్, కార్యదర్శి ఉమ్మడి సందీప్, పట్టణ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు బిసది వంశీ పలువురు బుధవారం కలిశారు. అనంతరం బల్మూరిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తెలంగాణ యువత రాష్ట్ర అధ్యక్షుడు, పట్టణానికి చెందిన ఇమ్మడి సతీష్ మర్యాద పూర్వకంగా బల్మూరిని కలిశారు. శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

నృత్య పోటీల్లో అవార్డులు

జమ్మికుంట: హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో మెగా కమల క్రాంతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నేషనల్ లెవల్ కూచిపూడి నృత్య పోటీల్లో జూనియర్ విభాగంలో పట్టణానికి చెందిన చిన్నారి బాదెల జశ్విక, బదెల యశస్విని స్పెషల్ కన్సోలేషన్ అవార్డులు గెలుచుకున్నారు. నృత్య దర్శకురాలు భాను ముఖ్య అతిథిగా హాజరై అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా జోష్విక నాట్య కళాక్షేత్రం గురువు స్వప్నలత, పట్టణ ప్రముఖులు చిన్నారులను అభినందించారు.

పల్లకీ సేవ


చొప్పదండి: పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు

చొప్పదండి: పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో బుధవారం పల్లకి సేవ నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అన్నవితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆధ్యాత్మికం

ఆలయ పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం పాలకవర్గ చైర్మన్, సభ్యులతో ఈవో సుధాకర్ బుధవారం ప్రమాణస్వీకారం చేయించారు. నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరుకాగా ఆలయ అర్చకులు శేషం మురళీధరాచార్యులు, మాధవాచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కోరెం రాజిరెడ్డి, ధర్మకర్తలు రామగిరి తిరుమల, ఎడ్ల తిరుపతి, కత్తరమల్ల రత్నం, మొకిరాల లక్ష్మణ్‌రావు, మీస రవీందర్, తాడిచెర్ల తిరుపతి ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. నూతన కమిటీని ఎమ్మెల్యే సన్మానించగా, ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు ఇచ్చారు. అనంతరం గాలిగోపురం నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఏఈ మల్లేశం, ఎస్సై రవి, మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య, మహిళా అధ్యక్షురాలు పద్మ, మాజీ ప్రజాప్రతినిధులు మల్లారెడ్డి, తిరుపతి, సదానందం , రాజిరెడ్డి, సంపత్, నాయకులు పాల్గొన్నారు.


గన్నేరువరంలో పోచమ్మ బోనాలు


శంకరపట్నం: ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఈవో

అన్నారంలో బీరన్న పట్నాలు

మానకొండూర్: మండలంలోని అన్నారంలో బీరన్న పట్నాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు. గొల్ల కుర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

పోచమ్మ బోనాలు

గన్నేరువరం: మండల కేంద్రంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా గ్రామ వీధుల ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. .

కన్నాపూర్‌లో ఎల్లమ్మ జాతర

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ గ్రామంలో గీతకార్మికుల ఆరాధ్య దైవం రేణుకా ఎల్లమ్మ జాతర బుధవారం ఘనంగా జరిగింది. జాతరలో భక్తులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

మడేలేశ్వర బోనాలు

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని బండమడుగు ప్రాంతంలో రజకుల ఆరాధ్య దైవం మడేలేశ్వరయ్యకు ఇంటింటి నుంచి బోనాలు సమర్పించారు. అనంతరం ఆలయ నిర్మాణ దాతలను సన్మానించారు.


జమ్మికుంటరూరల్: విరాళం అందిస్తున్న దాతలు

ఆలయాన్ని దాతల సహకారంతో నిర్మించుకోవడం సంతోషంగా ఉందని రజకసంఘం నాయకులు అన్నారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో మడేలే శ్వరయ్యకు ఇంటింటి నుంచి బోనాలు సమర్పించారు. అనంతరం ఆలయ నిర్మాణ దాతలను సన్మానించారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

జమ్మికుంటరూరల్: మండలంలోని మడిపల్లి గ్రామంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయం పునర్నిర్మాణానికి దాతలు అంబాల ప్రభాకర్ రూ.10,116, జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన మెకానిక్ రాంపల్లి మధు రూ.10,116 విరాళం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. నూతన ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు. ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ఉపసర్పంచ్ సత్యనారాయణ, రాములు, మల్లారెడ్డి, పసరగొండ సదానందం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ పరిధి గుడివెలుగులపల్లి గ్రామంలో వాటర్ ప్లాంట్ మూతపడటంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందిపడుతున్నారు. రెండు నెలలుగా ప్లాంట్ మూతపడటంతో గ్రామస్తులు దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలోని వెలిచాల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు తక్షణం స్పందించి వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేశ్వరి, ఎంపీడీవో, రామడుగు సెల్ నం : 96403 33888

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ప్రభుత్వ పథకాలు ప్రతి మహిళకు చేరాలి

తిమ్మాపూర్: స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు ప్రతీ మహిళకు అందేలా గ్రామ సంఘం పదాధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మండలంలో నూతనంగా ఎన్నికైన గ్రామైక్య సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులకు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన శిక్షణ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల్లో నిర్ణీత సభ్యుల సంఖ్య తగ్గకుండా చూడాలని ఆదేశించారు. పదోతరగతి పూర్తి చేయని సభ్యులు ఓపెన్‌స్కూల్ ద్వారా పరీక్షలు రాయాలని, ప్రతి సభ్యురాలు బుక్ కీపింగ్, అకౌంటింగ్ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో గతంలో 40 ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ఉండగా, వాటి సంఖ్యను 150కి పెంచినట్లు ఆమె తెలిపారు. ఎంపీడీవో విజయ్‌కుమార్, ఏపీఎం రామ్మోహన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **సంపన్న రైతు దేశానికి గర్వకారణం**

శంకరపట్నం: సంపన్న రైతు దేశానికి గర్వ కారణమని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. మొలంగూర్, మెట్‌పల్లి రైతువేదికల్లో వ్యవసాయశాఖ, జమ్మికుంట కేవీకే ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌పై రైతులకు అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానం, కేంద్ర, రాష్ట్ర వ్యవసాయపథకాలను వివరించారు. ఏడీఏ శ్రీధర్, ఏవో వెంకటేష్, శాస్త్రవేత్త మహేశ్,ఏఈవోలు తిరుపతి, కీర్తన, రైతులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని ఇల్లందకుంట, మల్యాల, లక్ష్మాజీపల్లి గ్రామాలలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం బుధవారంతో 14వ రోజుకు చేరుకుంది. వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై రైతులకు జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా వ్యవసాయ సహాయ సంచాలకులు సునీత హాజరై నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు విజయ్, వ్యవసాయ అధికారులు సూర్యనారాయణ, సంపత్, ప్రవళిక పాల్గొన్నారు.

- **భూమిపూజ**

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన కాల్వ ఎల్లమ్మకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఈసందర్భంగా ఇంటి నిర్మాణానికి బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు భూమిపూజ చేశారు.

- **జమ్మికుంట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

జమ్మికుంట: మున్సిపల్‌లో వందరోజుల ప్రణాళికలో భాగంగా పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. బుధవారం మారుతినగర్‌కాలనీలో పారిశుధ్య పనులు నిర్వహించారు. మేనేజర్ రాజిరెడ్డి, ఏఈలు నరేష్, వికాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, సదానందం సిబ్బంది పాల్గొన్నారు.

- **బీజేపీ నాయకుల సంబరాలు**

చొప్పదండి: పీఎం మోడీ 11 సంవత్సరాల పాలన సందర్భంగా బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో నాయకులు టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గుజ్జ శ్రీనివాస్‌రావు, బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ హాజరయ్యారు.

- **విద్యార్థులకు అవగాహన**

రామడుగు: మండలంలోని వెదిర గ్రామం అల్ఫోర్స్ స్కూల్ ఎన్‌సీసీ కెడెట్లకు బుధవారం కరీంనగర్ పోలీసులు ఆయుధాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఆర్ఐ రజనీకాంత్, ఆర్ఎస్సైలు విశ్వజా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

- **యాదవ కులస్తుల ఆందోళన**

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్‌లో బీరన్న ఆలయం ఎదుట యాదవ కులసక్తులు ఆందోళనకు చేశారు. ఉత్సవాలను జరుపుకుందామంటే కురుమ కులస్థులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఆలయాన్ని పునఃనిర్మాణం చేశామని, విగ్రహ ప్రతిష్ఠాపన చేయకుండా ఉత్సవాలు జరుపుకోవద్దని కురుమ కులస్తులు అన్నారు. ఇరువురు పోలీసులను ఆశ్రయించగా పండితుల సూచనలతో ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు.

ప్రైవేటు స్కూళ్లకు వెళ్లొద్దు


చొప్పదండి: బడిబాటలో మాట్లాడుతున్న టీచర్లు

చొప్పదండి: ప్రైవేటు స్కూళ్లకు వెళ్లొద్దు ప్రభుత్వ పాఠశాలకు రావాలని మండలంలోని వెదురుగట్ట టీచర్లు విద్యార్థులను కోరారు. అందుబాటులో ఉన్న పాఠశాలను వినియోగించుకోవాలన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లిలో నిర్వహించిన బడిబాటలో తహసీల్దార్ కనకయ్య పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన, సకల సదుపాయాలున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వీడెపు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కొండాల్రెడ్డి, ప్రాథమిక పాఠశాల ఇంచార్జి హెచ్ఎం దోమల సదానందం, ఉపాధ్యాయుల, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

గన్నేరువరం: ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం గల ఉపాధ్యాయులతో విద్యాబోధన ఉంటుందని మండల విద్యాధికారి రామయ్య అన్నారు. మండలంలోని పాఠశాలల టీచర్లు బడిబాట నిర్వహించంగా ఎంఈవో పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. బడీడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించాలని కోరారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీఎం లావణ్య పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

శంకరపట్నం: విద్యార్థులకు నాణ్యమైన, రుచికర భోజనం అందించాలని మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు మొలంగూర్ హెచ్ఎం నీరజ సూచించారు. బుధవారం మొలంగూర్ జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో హెచ్ఎంలు, మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో చర్చించారు.


చిగురుమామిడి: మాట్లాడుతున్న పావని


గన్నేరువరం: ఖాసీంపేటలో బడిబాట

సక్రమంగా వినియోగించుకోవాలి

చిగురుమామిడి: విద్యార్థులకు సమతుల ఆహారం అందించాలని ఎంఈవో వి.పావని అన్నారు. చిగురుమామిడి జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, శానిటేషన్ వర్కర్లకు ఒకరోజు శిక్షణం కార్యక్రమం నిర్వహించారు. నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలన్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం రబియాబస్రి, జిల్లా రిసోర్సు పర్సన్ లక్ష్మణ్‌రావు, మండల రిసోర్స్ పర్సన్ చంద్రశేఖర్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

దరాఖస్తులు ఆహ్వానం

రామడుగు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులకు దరాఖస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి నుంచి 12 వ తరగతి వరకు బోధించడానికి ఎకానమిక్స్-1, టీజీటీ తెలుగు -1, టీజీటీ హిందీ-2 పోస్టులు ఖాళీగా ఉ న్నాయని, సంబంధిత సబ్జెక్టుల్లో పీజీతో పాటు బీఈడీ, టెట్ అర్హత కలిగినవారు 16వ తేదీలోపు దరాఖస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరాఫరా బంద్

శంకరపట్నం: ఆముదాలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ లింక్‌లైన్ పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరాపరా నిలిపివేస్తున్నామని ఏఈ రఘు తెలిపారు.మొలంగూర్, చింతలపల్లి, గుడాటిపల్లి, నల్లవెంకయ్యపల్లిలో విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామదేవతలకు జలాభిషేకం



శంకరపట్నం: వర్షాలు కురవాలని మండలంలోని కన్నాపూర్‌లో రైతులు బుధవారం గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. కప్పతల్లి ఆడారు. వాలీ సుగ్రీవ ఆలయం ఆవరణలో వరదపాశం పోశారు.


రామడుగు: అంగన్‌వాడీ బాటలో సీడీపీవో నర్సింగరాణి


హుజూరాబాద్‌లోలో ర్యాలీ ..

అంగన్‌వాడీ బాట

హుజూరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నిరకాల సౌకర్యాలు ఉన్నాయని బుధవారం అంగన్‌వాడీ టీచర్లు పట్టణంలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ రమేష్ తదితరులు ఉన్నారు.


రామడుగు: వెదిరలో అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఐసీడీఎస్ గంగాధర ప్రాజెక్టు అధికారి నర్సింగరాణి, అంగన్వాడీ టీచర్లు, హెచ్ఎం సరళాదేవి, సీఏలు, వీవో లీడర్లు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి మూడో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట నిర్వహించారు. రెండున్నర సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్‌సూపర్‌వైజర్ శ్రీలత కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కక్కెర్ల శోభ, పెసరి రాజమణి, ఎలగందుల రాజమణి, కిషోర బాలికలు, పిల్లల తల్లులు , ఆయా లు ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల, చొక్కారావుపల్లెలో అమ్మబాట అంగన్‌వాడీ బాట నిర్వహించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఎగ్ బిర్యాని వడ్డించారు. ఎంఈవో రామయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, ప్రధానోపాధ్యాయులు రజినీకాంత్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పులి శారద, యాళ్ల ప్రేమలత, కార్యదర్శులుపాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని రాజాపూర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడీబాట ర్యాలీ నిర్వహించారు. 3-5 ఏళ్ల లోపు పిల్లలను పూలబోకేలతో ఆహ్వానించారు. అనంతరం ఎగ్ బిర్యాని వడ్డించారు. సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ టీచర్, ఆశకార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.


చిగురుమామిడి: మాట్లాడుతున్న శ్రీలత


శంకరపట్నం: రాజాపూర్‌లో అంగన్‌వాడీ బాట

రెవెన్యూ సదస్సులు

చిగురుమామిడి: రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందని, రెవెన్యూ సదస్సుల్లో సమస్యలపై దరఖాస్తు చేసుకుంటే రెండు నెలల వ్యవధిలో పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎం రమేశ్ తెలిపారు. బుధవారం మండలంలోని నవాబుపేట రైతు వేదికలో రెవెన్యూ సదస్సు నిర్వహించగా 109 దరఖాస్తులు వచ్చాయన్నారు.

హుజూరాబాద్‌రూరల్: సిర్సపల్లిలో రెవెన్యూ సదస్సు జరిగిందని, భూ సమస్యలకు సంబంధించి90 దరఖాస్తులు స్వీకరించామని తహసీల్దార్ కనుకయ్య తెలిపారు.

రామడుగు: కొక్కెరకుంటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 51 దరఖాస్తులు వచ్చాయన్నారు. తహసీల్దార్ రాజేశ్వరీ, డిప్యూటీ తహసీల్దార్ అరుణ్‌కుమార్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని ఆముదాలపల్లి, రాజాపూర్ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 91 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేఖ, డిప్యూటీ తహసీల్దార్ పార్థసారధి, ఆర్ఐలు బాలకిషన్, ప్రత్యూష, పాల్గొన్నారు.

జమ్మికుంటరూరల్: మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 86 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు సత్యనారాయణ, శంకర్, ఎంపీఎస్‌వో, సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

మానకొండూరు: మండలంలోని అన్నారంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 231 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్ఐ రాములు, ప్రీతి సిబ్బంది తెలిపారు. అన్నారం, ఈదులగట్టెపల్లి, రాఘవాపూర్ గ్రామాల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి రశీదులు అందజేశారు.


పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మనకొండూర్: మండల కేంద్రంలోని చాణక్య హైస్కూల్ 2010-11 పదో తరగతి విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్.ఎం రవీందర్, పద్మారెడ్డి, వేణు, కుమార్, నాగేందర్, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.